## క్లుప్తంగా

### ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురం గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వధువు డీతిక తల్లిదండ్రులు మాధురి, గాంధీలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లికానుకను బుధవారం అందించారు. వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్లు, మెట్టెలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందించినట్లు వైఎస్సార్‌సీపీ నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కేకేపీపురం సచివాలయ కన్వీనర్ జానకిరామ్ తెలిపారు.

### పుష్ప పల్లకిపై ముత్యాలమ్మ విహారం



పుష్పపల్లకిపై విహరిస్తున్న ముత్యాలమ్మ

భాకరాపేట: భాకరాపేట జాతరలో భాగంగా మూడు రోజు బుధవారం రాత్రి ముత్యాలమ్మ పుష్పపల్లకిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకి ముందు మంగళవాయిద్యాలు, కొలాటాలు, చెక్క భజనలు, వివిధ వేషాదారులు ముందు నడుస్తుండగా అమ్మవారు భక్తులకు అభయమిస్తూ ముందుకు సాగారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం



మోహన్‌కుమార్ రాజు, వాసుదేవన్, అయ్యప్ప

తిరుపతి కల్చరల్: తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కొండూరు మోహన్ కుమార్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తిరుపతి కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడితో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా కె.వాసుదేవన్, కోశాధికారిగా చేగు అయ్యప్ప నియమితులయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

### కాలువ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ నారాయణ

తిరుపతి తుడా: నగర పరిధిలోని 44, 34 వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. రూ. 8 లక్షల వ్యయంతో కాలువల నిర్మాణానికి ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ పోలిశెట్టి నాగిరెడ్డి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నాదముని, పార్టీ నాయకులు ధనుంజయ, గిరి, లక్ష్మి, ప్రభాకర్, మంజుల పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్యా.. వెంటనే కాల్ చేయండి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ విద్యుత్ డివిజన్ పరిధిలో అధిక ఉష్ణోగ్రతల నమోదు అవుతున్న నేపథ్యంలో విద్యుత్ అంతరాయలు ఏర్పడుతున్నాయని డివిజన్ ఈఈ వాసురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో సాధారణ విద్యుత్ వాడకం 3.5 నుంచి 3.9 మిలియన్ యూనిట్లు ఉందని, అయితే రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల వినియోగం 4.2 మిలియన్ యూనిట్లకు పెరిగిందన్నారు. దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అయి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ వి నియోగం వల్ల ఎక్కడైనా అంతరాయం ఎదు రైతే ఆయా సెక్షన్ల ఏఈలకు సమాచారం ఇ వ్వాలని కోరారు. చంద్రగిరి డీఈ(94408117 80), చంద్రగిరి (9440811782), చంద్రగిరి రూరల్ (9440811783), తిరుపతి రూరల్ (9440811781), పాకాల డీఈ(9440811 800), పాకాల (9440811801), పాకాల రూరల్ (944081 1803) ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

### వేధింపులపై కేసు నమోదు

కోట: మండలంలోని ఊనుగుంటపాళెం సచివాలయ సర్వేయర్‌ను వేధింపులకు గురిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుల్లారావు బుధవారం తెలిపారు. విద్యానగర్ ఎన్టీఆర్ కాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి కొద్దిరోజులుగా ఫోన్‌లో వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ఆంధ్రభోజుడి చరితకు చిహ్నం

ఆంధ్రభోజుడు, తెలుగు భాష ఘన కీర్తిని యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నతుడు.. రాయలసీమను రతనాల సీమగా మార్చిన శ్రీకృష్ణదేవరాయల పాలన, వైభవానికి చిహ్నంగా చంద్రగిరి కోట నిలుస్తోంది. 500 ఏళ్ల క్రితం రాయలవారు చంద్రగిరిని రెండవ రాజధానిగా చేసుకుని పరిపాలన చేసినట్లు ఈ కోటలో ఆధారాలు ఉన్నాయి. రాజులు, రాజ్యాలు పోయినా వారు మనకు అందించిన జాతి సంపద మాత్రం నేటికీ చెక్కు చెదరలేదు.

- చెక్కు చెదరని 500 ఏళ్ల నాటి చంద్రగిరి కోట
- కొత్త శోభను సంతరించుకున్న కోట
- పర్యాటకులతో కళకళ



చంద్రగిరి కోట



బోటు షికారు



ముస్లిం పాలనలో ధ్వంసమైన విగ్రహాలను కోట ప్రవేశమార్గంలో ప్రదర్శనగా ఉంచిన దృశ్యం

చంద్రగిరి: పర్యాటక స్థలాల్లో రాజప్రసాదాలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. రాజులు, రాణులు, ఖడ్గాలు, రాజమహల్, కోట, అలనాటి అద్భుత శిల్ప సౌందర్యం, పురాతన వస్తువులు.. ఇలా ఒకటేమిటి ? ఔత్సాహికులకు ఎన్నో ఆసక్తికర విషయాలు చంద్రగిరి కోటలో తెలుస్తాయి. విజ్ఞానంతో పాటు ఆసక్తిని పెంచే చరిత్ర ఆనవాళ్లను నేటికి సాక్షిగా చూపుతూ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది చంద్రగిరి కోట.

**స్థలపురాణం..**

పూర్వం శివుణ్ణి ప్రసన్నం చేసుకునేందుకు చంద్రుడు ఒక ఎత్తైన కొండపైకి ఎక్కి అహర్నిశలు తపస్సు చేయగా, ఆ భక్తికి మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరాల జల్లు కురిపించాడని ప్రతీతి. అప్పటి నుంచి ఆ కొండను చంద్రగిరి అని అంటున్నారని ఇక్కడ స్థల పురాణం చెబుతోంది.

**చారిత్రక నేపథ్యం..**

చంద్రగిరి కోటను, నారాయణవనాన్ని పాలించిన ఇమ్మడి యాదవ నరసింహరాయులు క్రీ.శ. 1000 కిందట చంద్రగిరి కోటను నిర్మించాడు. అనంతరం క్రీ.శ.1314లో చంద్రగిరి కోట యాదవరాజుల అ. దీనంలోకి వచ్చింది. పలువురు రాజులు పాలించిన తర్వాత చంద్రగిరి కోటకు శ్రీకృష్ణదేవరాయలు రాజయ్యాడు. ఈయన కాలంలోనే చంద్రగిరి దక్షణ భారత దేశంలో ప్రధాన నగరంగా విరాజిల్లింది.

**ఆకట్టుకునే అంశాలు..**

రాయలవారికోట, రాణిమహల్, బోటింగ్, లైటింగ్ షో, ఆహ్లాదకర వాతావరణం, ఉద్యానవనం, పురాతన వస్తు ప్రదర్శన, శత్రు దుర్భేద్యమైన కోట, ప్రాకారం పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. చంద్రగిరి కోట మ్యూజియం ప్రవేశ రుసుము రూ.20. లైటింగ్ షో పెద్దలకు రూ.45, పిల్లలకు రూ.35 చెల్లించాలి.

**ఎలా వెళ్లాలంటే..**

తిరుపతి నుంచి చంద్రగిరికి 14 కిలోమీటర్ల దూరం. తిరుపతి నుంచి ప్రతి పదినిమిషాలకు ఒక బస్సు ఉంది. అలాగే నిత్యం ట్యాక్సీలు, ఆటోలు అందుబాటులో ఉన్నాయి. రైళ్లల్లో వచ్చేవారు చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడ నుంచి కేవలం ఆరు కిలోమీటర్ల దూరం ఆటోలో ప్రయాణిస్తే చంద్రగిరి కోటను చేరుకోవచ్చు. చిత్తూరు వైపు నుంచి వచ్చేవారికి హైవేలోనే పెద్ద కొండపై కోట గోడ కనిపిస్తుంది. అయితే చంద్రగిరి కోటలో ప్రతిరోజు సాయంత్రం సౌండ్ అండ్ లైటింగ్ షోను నిర్వహించేవారు. అయితే కోటపై పిడుగు పడడంతో యంత్రాలు కాలిబూడిదయ్యాయి. అప్పటి నుంచి సౌండ్, లైటింగ్ షోకు మరమ్మతులు చేపట్టడకపోవడంతో సందర్శకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అదేవిధంగా కోటలోని కొలనులో బోటింగ్‌ను సైతం పర్యాటకశాఖ నిలిపివేసింది. అధికారులు స్పందించి కోటలో సౌండ్, లైటింగ్‌షో, బోటింగ్‌ను పునరుద్ధరించాలని సందర్శకులు కోరుతున్నారు.



చంద్రగిరి కోటలో ప్రదర్శనగా రాజులు వాడిన కత్తులు



కోటలో పురావస్తు శాఖ అధికారులు ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు

# గంగమ్మకు సారె సమర్పణ



కుంట్రపాకంలో గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం పూజలు చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



గ్రామస్తులతో కలిసి గంగమ్మకు సారె తీసుకెళుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని చిగురువాడ, కుంట్రపాకం, తనపల్లి పంచాయతీల్లో బుధవారం జరిగిన గంగమ్మ జాతరలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందడి చేశారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకెళ్లి జాతర జరిగే గ్రామాల్లో గంగమ్మకు సమర్పించారు. ఆయా పంచాయతీ సర్పంచ్‌లు ముచ్చెలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శుభపద్మనాభరెడ్డి, సునీత సుబ్రమణ్యం, గ్రామస్తులు ఆయనకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం స్థానికులతో కలిసి సరదాగా కొంతసేపు అమ్మవారి ఆలయం వద్ద గడిపారు. పలువురు యువకులు మోహిత్‌రెడ్డితో సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



జమున భర్తకు చెక్కును అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: అనారోగ్యంతో వైద్యం చేయించుకుని ఆర్థికంగా చితికిపోయిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు ఉప సర్పంచ్ జమున కరోనా బారినపడి ఆస్పత్రిలో చేరి మృతి చెందారు. ఈ మేరకు ఆమె కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కు మంజూరైంది. అలాగే గంగనగుంటకు చెందిన సుజాతకు రూ.70 వేలు మంజూరైంది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో వచ్చిన చెక్కులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాలకు అందించారు.

# వైద్యశాఖలో సాధారణ బదిలీలపై హర్షం



రాజా, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు

తిరుపతి తుడా: ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు అన్ని శాఖలతో పాటు వైద్య శాఖలో సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషంగా ఉందని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శాఖలో పరస్పర అంగీకార బదిలీల జీఓ విడుదల అయిన వెంటనే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఉద్యోగుల సంఘం నాయకుడు అరవపాల్ కలిసి ఈ జీఓ వల్ల ఉద్యోగులు నష్టపోతారని విజ్ఞప్తి చేశారన్నారు. స్పందించిన ప్రభుత్వం అన్ని శాఖలతో సమానంగా సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బుధవారం జీఓ జారీ చేసిందన్నారు. సాధారణ బదిలీలకు కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతిలో విజయ్ ఆంటోని సందడి



తిరుపతి దేవేంద్ర థియేటర్‌లో ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్న విజయ్ ఆంటోని



పేదలు, యాచకులకు నిత్యావసరాల పంపిణీ అనంతరం వారితో సెల్ఫీ

- బిచ్చగాడు-2 చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు
- త్వరలో పార్ట్-3తో ముందుకొస్తా

తిరుపతి కల్చరల్: బిచ్చగాడు చిత్రం హీరో విజయ ఆంటోని బుధవారం తిరుపతిలో సందడి చేశారు. బిచ్చగాడు-2 చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా తిరుపతికి చేరుకున్న విజయ్ ఆంటోని తొలిత కపిలతీర్థంలోని బిచ్చగాళ్లతో కాసేపు ముచ్చటించి వారికి బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బిచ్చగాడు సినిమా ప్రదర్శిస్తున్న సీఎస్ సినిమాస్ (దేవేంద్ర థియేటర్)కు చేరుకున్నారు. ఈ సందర్భంగా థియేటర్ యాజమాన్యం, ఆయనకు పూల మాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన తొలి బిచ్చగాడు చిత్రాన్ని ప్రేక్షక దేవుళ్లు ఆదరించి ఘన విజయాన్ని అందించారని గుర్తు చేశారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో బిచ్చగాడు-2 చిత్రాన్ని తీసుకొచ్చానని తెలిపారు. మొదటి పార్ట్ వ్యక్తిగత కథ అని, రెండో భాగం బిచ్చగాడు-2 సామాజిక దృక్పథంతో మంచి సందేశాత్మకంగా రూపొందించామని, ఈ చిత్రాన్ని కూడా ప్రేక్షకులు విజయాన్ని అందించడం సంతోషకరమన్నారు. మరో ఏడాది తర్వాత మూడో భాగంగా బిచ్చగాడు-3 చిత్రాన్ని రూపొందించి మీ ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులు హీరో విజయ్ ఆంటోనితో సెల్ఫీ దిగేందుకు ఎగబడ్డారు.

# వలంటీర్లు సంక్షేమ సైనికులు

- నగర మేయర్ డాక్టర్ శిరీష



ప్రశంసాపత్రాలు అందుకున్న వలంటీర్లతో మేయర్ శిరీష

తిరుపతి తుడా: వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సంక్షేమ పథకాలను చేరవేస్తున్న ప్రజా సేవకులని నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం 27వ డివిజన్‌కు సంబంధించి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించేందుకు సచివాలయ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వారి సేవలను గుర్తిస్తూ ప్రోత్సహించాలన్న సంకల్పంతో మూడేళ్లుగా వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రా పురస్కారాలను అందజేశామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్లు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. సకాలంలో అర్హత కలిగిన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజల మన్ననలు మరింత పొందేలా ప్రతి వలంటీర్ పోటీపడి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 27వ డివిజన్ అధ్యక్షుడు భరణి యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వలంటీర్ల సేవలు అభినందనీయం**



వలంటీర్లను సత్కరిస్తున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని తిరుపతి టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి 8వ డివిజన్‌లో 'వలంటీర్లకు వందనం' నిర్వహించారు. కార్పొరేటర్ మునిరామిరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మురళి, నాయకులు గఫూర్ వలంటీర్లను సత్కరించారు.

# టీటీడీ ఈఓ స్ఫూర్తితో బర్డ్‌లో శ్రమదానం




శ్రమదానానికి వెళుతున్న బర్డ్ ప్రత్యేక అధికారి రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, వైద్యులు



బర్డ్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి తుడా: శ్రమదానం చేయడం వల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతి ఒక్కరిలో స్వచ్ఛ స్ఫూర్తి నింపుతుందని బర్డ్ ప్రత్యేక అధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డప్ప రెడ్డి అన్నారు. బర్డ్ ఆస్పత్రిలో బుధవారం వైద్యులు, వైద్య సిబ్బంది శ్రమదానం చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో చెత్తను ఊడ్చి, పిచ్చి మొక్కలను తొలగించారు. పరిశుభ్రతపై రోగుల సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచపల్లి రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల టీటీడీ పారిశుద్ధ్య కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె చేశారన్నారు. ఆ క్రమంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల్లో స్వచ్ఛ చైతన్యం రగిలించిందన్నారు. కేవలం తమ విధులేగాక తిరుమల పరిశుభ్రత, మన కార్యాలయం మన బాధ్యత అని గుర్తు చేసిందన్నారు. అధికారులు, ఉద్యోగులు సంయుక్తంగా తిరుమల, పరిసర ప్రాంతాలను రోజుల తరబడి పరిశుభ్రంగా ఉంచేందుకు తీవ్రంగా శ్రమించారన్నారు. అదే స్ఫూర్తితో ఇకపై బర్డ్ ఆస్పత్రిలో ప్రతినెలా శ్రమదానాన్ని నిర్వహిస్తామన్నారు. బర్డ్ ఆస్పత్రి ఇప్పటికే పరిశుభ్రతలో సాటిలేని ఆస్పత్రిగా నిలిచిందన్నారు.

### హాకర్ల మధ్య గొడవ.. కత్తితో దాడి

తిరుమల: వ్యక్తిగతంగా దూషించడంతో కత్తితో హాకర్‌పై దాడి చేసిన సంఘటన బుధవారం తిరుమలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక సీఆర్వో కార్యాలయం సమీపంలో చెల్లా అశోక్, నాగేంద్ర మామిడికాయలు వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగేంద్ర అమ్మను చెల్లా అశోక్ దూషించాడు. దీంతో కోపోద్రిక్తుడైన నాగేంద్ర చెల్లా అశోక్‌తో గొడవపడి కత్తితో గాయపరిచాడు. సమాచారం అందుకున్న తిరుమల టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. నాగేంద్రను అదుపులోకి తీసుకున్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్యే వెంకటే గౌడ, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే, ఎమ్మెల్యే వెంకటే గౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

# విద్యార్థినితో ఆటోడ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

నాయుడుపేటటౌన్: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసేందుకు ఆటోలో వెళుతున్న విద్యార్థినితో ఆటో డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన నాయుడుపేటలో బుధవారం చోటు చేసకుంది. బాధితురాలు ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం ఓ విద్యార్థిని నాయుడుపేట బస్టాండులో బస్సు దిగి, పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే ఆటోలో విద్యార్థిని మాత్రమే ఉండడంతో ఆటో నడుపుతున్న వ్యక్తి మానవ మృగంలా మారాడు. ఆటోను పరీక్ష కేంద్రం వద్ద నిలపకుండా ఎవరూ లేని ప్రాంతం వద్ద ఆటో ఆపి విద్యార్థితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని కేకలు వేసి భయాందోళనతో పరుగు తీసింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహరావు ఆటోతోపాటు నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.